క్లుప్తంగా

సత్కారం

హబ్సిగూడ: బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు గురువారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఆనంద్‌బాబును శాలువాతో సత్కరించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, గుడి మధుసూదన్‌రెడ్డి, రవీందర్, కృష్ణారెడ్డి, రాజు, యాదగిరి తదితరులు ఉన్నారు.

కార్మికులకు అన్నదానం

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ మానసిక వికలాంగుల స్కూల్, సగిలి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 170 మందికిపైగా భవన నిర్మాణ కార్మికులకు అన్నదానం చేశారు. అనంతరం అనురాగ్ స్కూల్‌లోని మానసిక వికలాంగుల విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా కిరాణ సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనురాగ్ స్కూల్ సిబ్బంది, సగిలి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ ఫీజు తగ్గించాలి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 13వ డివిజన్‌కు చెందిన కాలనీవాసులు గురువారం మేడిపల్లి తహసీల్దార్‌ను కలిశారు. జీవో నంబర్–59 ప్రకారం క్రమబద్ధీకరణ కోసం తమ ప్లాట్స్‌కు సంబంధించి అధికంగా పన్నులు విధించారని, చెల్లించలేని స్థితిలో ఉన్నామని విన్నవించుకున్నారు. కూలీ, నాలీ చేసుకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం టాక్స్‌లను తగ్గించాలని కోరారు. సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి, డివిజన్ అధ్యక్షుడు గోపు రాము, యువజన నాయకులు జెన్న రాజు, కొండ శ్రీనివాస్, పండ్ల మల్లయ్య, విజయలక్ష్మి తదితరులున్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

గౌతంనగర్: వాణీనగర్ విజయ వినాయక ఆలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మల్కాజిగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో లయన్స్ ఎంఎస్‌రెడ్డి కంటి ఆసుపత్రి సౌజన్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం కొనసాగింది. అసరమైన వారికి కంటి అద్దాలు అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ మల్కాజిగిరి సెంట్రల్ ప్రతినిధులు తెలిపారు.

వాసిరెడ్డి హనుమంతరావుకు నివాళి

గౌతంనగర్: సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వ్యవస్థాపకుడు దివంగత వాసిరెడ్డి హనుమంతరావు వర్ధంతిని గురువారం హనుమాన్‌పేట్ బ్రాంచ్‌లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సౌజన్య, సిబ్బంది అనీల్‌కుమార్, ప్రియాంక, హర్ష, దినేష్, ఖాతాదారులు ఏవీ స్వామి, కందస్వామి ఉన్నారు.

'ఆయుష్మాన్ భారత్'తో ఉచిత వైద్య సేవలు

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకంలో దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని ఎస్వీ చంద్రయ్య ఫౌండేషన్ చైర్మన్ ఎస్వీ కిట్టు అన్నారు. మల్లాపూర్‌లో ఆయుష్మాన్ భారత్ ఉచిత నమోదు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీ కిట్టు మాట్లాడుతూ.. ఈ పథకంలో రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. అధికారులు మంజుల, భవానీ, ఫీరోజ్‌ఖాన్, రమేష్ నాయక్, కిరణ్, తదితరులు ఉన్నారు.

విష్పర్ ఆధ్వర్యంలో కీప్ గాల్స్ ఇన్ స్కూల్స్ ప్రచారం

సాక్షి, సిటీబ్యూరో: బాలికల్ని పాఠశాలకు దూరం చేయవద్దనే సందేశంతో ప్రముఖ సంస్థ ప్రోక్టర్ అండ్ గాంబెల్ ఇండియా ఆధ్వర్యంలో కీప్ గాల్స్ ఇన్ స్కూల్స్ పేరిట ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. అధ్యయనాలు వెల్లడించే దాని ప్రకారం, భారతదేశంలో ప్రతి సంవత్సరం ప్రతి ఐదుగురు బాలికల్లో ఒక బాలిక ఋతుక్రమంపై అవగాహన లేక పాఠశాల విద్యకు దూరమవుతున్నారని, ఈ నేపథ్యంలో సహజమైన శారీరక మార్పులపై బాలికల తల్లులకు అవగాహన కల్పించేందుకు ప్రచార సామాగ్రితో పాటు తమ విష్పర్ బ్రాండ్ ద్వారా ఉచిత ప్యాడ్స్ పంపిణీ చేపట్టామన్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ

అల్వాల్: ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కానాజీగూడ గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీలో నివాసముండే నవీన్‌కుమార్ తన బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారం, 50 తులాల వెండి, నగదు దోచుకెళ్లారు. ఇంటి సమీపంలో ఉండే నవీన్‌కుమార్ స్నేహితుడు ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలో ఇరుక్కుపోయిన లారీ



గుంతల్ తిప్పల్

- అధ్వానంగా బోడుప్పల్ ప్రధాన రహదారి
- గుంతలమయంగా చిలుకానగర్ వెళ్లే రోడ్డు
- తీవ్ర అవస్థలు పడుతున్న వాహనదారులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. వీరారెడ్డినగర్ చౌరస్తా నుంచి చిలుకానగర్ వరకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. అడుగడుగునా గుంతలు ఉండటంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిలో ఎగుడు దిగుడుగా ఉండటంతో వేగంగా వచ్చే వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. అంతేగాకుండా కంకర తేలి ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్ల దుస్థితిపై స్థానికులు పలుమార్లు అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

4 ఏళ్లుగా గాలికి వదిలేసి..

నాలుగేళ్లలో అటు అధికారులు, ఇటు పాలకవర్గం ప్రధాన రహదారుల గురించి పట్టించుకోలేదు. **బడ్జెట్‌లో కేటాయించిన నిధులను అన్ని డివిజన్లకు సమానంగా కేటాయించి కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ, బీటీ రోడ్లు, తాగునీరు ఇతర** సదుపాయాలకు వెచ్చించారు. ప్రధాన రహదారులను గాలికి వదిలేసి తూతూ మంత్రంగా ప్యాచ్ వర్క్‌లు చేపట్టారు. సదరు ప్యాచ్‌వర్క్‌లపై నుంచి భారీ వాహనాలు వెళ్లినప్పుడు సదరు రోడ్లు కంకర తేలడం, గుంతలు పడటం జరుగుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

మూడ్రోజుల్లో నాలుగు ప్రమాదాలు

బోడుప్పల్ నుంచి చిలుకానగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలోని రోడ్డు మధ్యలో ఓ పెద్ద గుంత పడింది. సదరు గుంతలోకి ఆ చుట్టుపక్కల వాసులు రోడ్డుపై పోసిన నీరు వచ్చి చేరింది. దీంతో సదరు గుంత నీటితో నిండిపోయింది.

- మూడు రోజుల క్రితం బోడుప్పల్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి పారిశ్రామికవాడకు ఉద్యోగం నిమిత్తం వెళ్లాడు. రాత్రి 7 గంటల తర్వాత విధులు ముగించుకుని ఇంటికి వస్తున్నాడు. అదుపుతప్పి గుంతలో పడి గాయాల పాలయ్యాడు.
- రెండు రోజుల క్రితం లోడ్‌తో వచ్చిన ఓ లారీ అదుపు తప్పి గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోవడంతో లారీలోని లోడ్‌ను తొలగించి లారీని తరలించారు.
- ఇంటి నిర్మాణానికి వాడే ఇనుప చువ్వల లోడ్‌తో ఓ డీసీఎం గుంతలో అదుపుతప్పి పడిపోయింది. డీసీఎం వెనుక నుంచి ఓ ద్విచక్ర వాహనదారుడు వస్తుండగా ఇనుప చువ్వలు వాహనంపై పడ్డాయి. వెంటనే వాహనదారుడు తప్పించుకున్నాడు. నగర పాలక సంస్థ పరిధిలో పనిచేసే ఓ ఉద్యోగి అదుపు రోడ్డుపై పడ్డాడు. చిన్న గాయాలయ్యాయి.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



ప్రధాన రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. చిలుకానగర్ వైపు వెళ్లే రహదారి అయితే అధ్వానంగా ఉంది. ఇదే విషయమై మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా స్పందించడం లేదు. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతాం.

– మాదుగుల శివయాదవ్, హేమానగర్‌వాసి

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



ఎమ్మెల్సీలను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి తదితరులు



సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి గురువారం ప్రగతిభవన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు ఉన్నారు.

అభినందనలు

మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు చల్లా వెంకటరామిరెడ్డి, దేశపతి శ్రీనివాస్, నవీన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించారు.

సేవా దృక్పథంతో ముందుకు సాగాలి



పండ్లు పంపిణీ చేస్తున్న శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అల్వాల్: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కుమార్, కాశేశ్వరరెడ్డి అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని కాలనీలోని మదర్ నెస్ట్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ, అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ సామాజిక సేవే లక్ష్యంగా శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తుందన్నారు. వృద్ధులు, అనాథలు, పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం సప్తగిరి కాలనీలోని జర్రీ ఫౌండేషన్ అనాథాశ్రమంలోని పిల్లలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు సానక్, శ్రీకాంత్, కాలేశ్వర్‌రెడ్డి, సాయి, మదర్ నెస్ట్ వృద్ధాశ్రమం వ్యవస్థాపకురాలు మాలతి, జర్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోలా ఏసు ఉన్నారు.

ఉప్పల్ టీఎక్స్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

ఉప్పల్: ఉప్పల్ టీఎక్స్ ఆస్పత్రిలో ఓ రైతుకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన రైతు అరుదైన (సూడోమిక్సోమ పెరిటోమై- అపెండిసియల్ మ్యూకినస్ నియోప్లాసమ్, పెరిటోనియల్ డిసిమినేషన్) అనే వ్యాధితో బాధపడుతున్నారు. ఈ వ్యాధిని నెలన్నర క్రితమే ఉప్పల్ టీఎక్స్ ఆస్పత్రి వైద్యులు గుర్తించారు. వ్యాధి మూలాలను సమర్థవంతంగా గుర్తించి శస్త్ర చికిత్సకు సిద్ధమయ్యారు. దాదాపు 17 గంటల పాటు శ్రమించి హైపెక్ సర్జరీని విజయవంతం చేశారు. ఉప్పల్ టీఎక్స్ ఆస్పత్రిలో రోగి కుటుంబ సభ్యులతో కలిసి డాక్టర్ల బృందం గురువారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. సర్జికల్ ఆంకాలజిస్ట్ డా.చంద్రశేఖర్ ఆజాద్, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డా.సుదర్శన్, డా.అమర్‌నాథ్ రెడ్డి, డా.శ్రావణి, డా.త్రివిక్రం, డా.సతీష్ బృందం, సీఈవో డా.శ్రీకాంత్ మాట్లాడుతూ వ్యాధి కణాలు పొట్ట భాగంలోని అన్ని ప్రధాన అవయవాలకు పాకిపోవడంతో వ్యాధి కణాలన్నింటినీ సమర్థవంతంగా తొలగించినట్లుగా వైద్య బృందం తెలిపింది. ఇలాంటి అరుదైన వ్యాధి 10 లక్షల్లో ఒకరికి వస్తుందని చెప్పారు. హైదరాబాద్ ఈస్ట్ పరిధిలో ఈ తరహా శస్త్రచికిత్స విజయవంతం కావడం మొదటిసారి అని వైద్య బృందం తెలిపింది.



వివరాలను వెల్లడిస్తున్న సీఈవో శ్రీకాంత్, ఇతర డాక్టర్ల బృందం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

కుషాయిగూడ: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీ మెయిన్ రోడ్డుపై డైమండ్‌హిల్స్ కాలనీకి చెందిన మైనార్టీ సోదరులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ఇమ్రాన్, ముజ్జు, ఇబ్రహిం, రిజ్వాన్‌తో పాటుగా బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గరిక సుధాకర్, నిస్సార్ అహ్మద్, నరేందర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో కాంగ్రెస్ జిల్లా సంయుక్త కార్యదర్శి జి.సూర్యప్రకాష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ గురువారం ప్రారంభించారు. శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, ఉమేష్‌సింగ్, వినోద్‌యాదవ్, గుత్తి చందు పాల్గొన్నారు.

ఇంటికే పరిమితం కావొద్దు

అల్వాల్: మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్నిరంగాల్లో ముందు ఉండాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అల్వాల్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డితోపాటు సర్కిల్ పీఓ మదన్‌మోహన్, సీఓ సురేష్, స్వరూప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వైద్య శిబిరానికి స్పందన

అల్వాల్: అల్వాల్ సీనియర్ సిటిజన్స్ సంఘం సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం అల్వాల్‌లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సెల్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సీనియర్ సిటిజన్ సంఘం సభ్యులు, వారి కుటుంబ సభ్యులు సుమారు 70 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సంఘం అధ్యక్షుడు సౌందార్యేశ్వర్, కార్యదర్శి జి.సుదర్శన్‌రావు, విశ్రాంత వైద్యులు పి.లింగం, వైద్యులు కళ్యాణి, డాక్టర్ సాదురి బృందం తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



మహేష్‌నగర్‌లో డ్రైనేజీని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న పావనీరెడ్డి

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ మహేష్‌నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం సంబంధిత అధికారులతో కలిసి ఆమె కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. సమస్యను పరిష్కరించే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ స్రవంతిరెడ్డి, సిబ్బంది అరుణ్, గోవర్ధన్, సహదేవ్, కాలనీవాసులు గంగయ్య, సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం

రామంతాపూర్: రామంతాపూర్ ప్రగతినగర్‌లో గురువారం కార్పొరేటర్ బంగారు శ్రీవాణివెంకట్రావు జలమండలి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నూతన డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రవీందర్, కిషన్, సాగర్, ప్రగతినగర్ కాలనీ అధ్యక్షుడు బొబ్బల వెంకటరెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

అల్వాల్: అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని టీఆర్ఎస్ సీనియర్ నేత అనీల్‌కుమార్‌గౌడ్ అన్నారు. వెంకటాపురం విలేజీలో రూ.40 లక్షలతో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. అభివృద్ధి నిర్మాణ పనుల్లో అధికారులు అలసత్వం వీడాలన్నారు. పనులు వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. నాయకులు భాస్కర్, రాజేష్‌గౌడ్, విజయకుమార్, జనార్దన్, అరుణ్‌గౌడ్, విజయశేఖర్, ప్రభాకర్, మోసీన్, సూరజ్ ఉన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తూ..

వైకుంఠధామం నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం

బోడుప్పల్: చెంగిచర్లలోని వైకుంఠధామం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడంతో పచ్చదనం లేకుండా పోయిందని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. చెంగిచర్లలోని వైకుంఠధామాన్ని గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఇష్టారాజ్యంగా పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను పట్టించుకోకపోవడంతో ప్రజాక్షేత్రంలో విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. చెంగిచర్లలోని కాకతీయకాలనీ, క్రాంతికాలనీ, ప్రివిలేజ్ కాలనీల్లోని ప్రకృతి వనాలను పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, కొత్త చందర్‌గౌడ్, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్, డీఈఈ శ్రీలత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, హరితహారం సూపర్‌వైజర్ సాకేత్ తదితరులున్నారు.



అధికారులతో చర్చిస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

న్యాయం చేయాలంటూ విద్యార్థుల వేడుకోలు



కాలేజీ ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత విద్యార్థులు

కుషాయిగూడ: హాజరు శాతాన్ని తక్కువగా చూపుతూ విద్యా సంవత్సరాన్ని వృథా చేస్తున్న దేవ్స్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ యజమాన్యంపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని నర్సింగ్ విద్యార్థులు కోరుతున్నారు. హాజరు శాతాన్ని తక్కువగా చూపి హాల్‌టికెట్లు రాకుండా చేసిందని దేవ్స్ నర్సింగ్ కాలేజీలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆరోపిస్తున్నారు. యజమాన్యం తప్పుడు సమాచారం పంపడంతో 50 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు అందక పరీక్షకు దూరం కావాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. జరిమానాతో ఈ నెల 18 వరకు ఫీజు కట్టుకునే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి యజమాన్యం తీరుపై విచారణ జరిపి హాల్‌టికెట్లు అందేలా చూడాలని వేడుకుంటున్నారు.

భూకబ్జాదారులకు రెడ్ కార్పెట్

- డబుల్ ఇళ్ల హామీ మరిచిన రాష్ట్ర ప్రభుత్వం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలమల్లేష్

అల్వాల్: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం భూకబ్జాదారులకు రెడ్ కార్పెట్ పరుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.బాలమల్లేష్ అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గురువారం నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు సిలిండర్ ధర రూ.410 ఉంటే 2023లో దాదాపు రూ.1200లకు పెంచి సామాన్యులపై భారం మోపిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళితులకు 3 ఎకరాల భూమి చొప్పున పంపిణీ చేస్తామని, ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. మరోపక్క భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఐటీ కంపెనీలకు, రెడ్ కార్పెట్ పరిచి అప్పనంగా అమ్మేస్తోందని విమర్శించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

మౌలాలి: కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అవకాశం ఉందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. జోడో యాత్రలో భాగంగా గురువారం మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీ, కృష్ణానగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జీడీ శ్రీనివాస్‌గౌడ్, పోల్కం వెంకటేష్, జీవన్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, ఉమేష్‌సింగ్, సంతోష్ ముదిరాజ్, మహేందర్‌గౌడ్, శ్రీను, రాజేష్‌గౌడ్, విఠల్ ముదిరాజ్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మౌలాలిలో కాంగ్రెస్ జోడో యాత్రలో నందికంటి శ్రీధర్

బహిరంగ ప్రదేశంలో పొగ తాగినందుకు 'స్వచ్ఛ్ సేవ'



ఉప్పల్: బహిరంగ ప్రదేశంలో పొగ తాగిన వ్యాపారికి ఎల్బీనగర్ కోర్టు మూడు రోజుల పాటు స్వచ్ఛ్ భారత్ సేవ చేయాలని ఆదేశించింది. ఉప్పల్ భరత్ నగర్ ప్రాంతానికి చెందిన చిందం బాల మల్లేష్(39)ఈ నెల 14వ తేదీన ఉప్పల్‌లో జన సంచారం ఉన్న ప్రాంతంలో, బహిరంగంగా పొగతాగుతుండగా అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అతడిని వారించారు. దీంతో ఆగ్రహానికి గురైన సదరు వ్యక్తి పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి ఎల్బీనగర్ కోర్టులో హాజరుపర్చగా మూడు రోజుల పాటు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. దీంతో అతడు గురువారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛ్ భారత్ సేవ చేశాడు.

గీత కార్మికులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అండదండలు

ఉప్పల్: రాష్ట్రంలో గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అండదండలు మెండుగా ఉన్నాయని జైగౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు, ఓయు జేఏసీ నాయకుడు వట్టికూటి రామారావు గౌడ్ అన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో ఉప్పల్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బింగి భిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాతే గీత కార్మికుల జీవితాల్లో వెలుగు నిండిందని అన్నారు. ఉప్పల్ గౌడ సంఘం ప్రతినిధులు మీనంపల్లి కృష్ణగౌడ్, బొంగు రమేష్‌గౌడ్, శివరాజ్, భూత్కూరి కృష్ణ గౌడ్, బందారం లక్ష్మణ్, ఆయెధ్య, గోనే ప్రకాశ్, కిషన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వట్టికూటి రామారావుగౌడ్

అనాథ యువతి పెళ్లికి ఆర్థిక సాయం

గౌతంనగర్: తల్లిదండ్రులు లేని అనాథ యువతి పెళ్లికి మానవసేవే- మాధవసేవ వాట్సాప్ గ్రూప్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వివరాల్లోకెళ్తే.. వినాయక్‌నగర్‌లో నివాసం ఉండే స్వాతి తల్లి రెండేళ్ల క్రితం కేన్సర్‌తో..., తొమ్మిదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. ప్రస్తుతం వరుసకు మేనత్త అయ్యే శారద వద్ద ఉంటోంది. 17వ తేదీ శుక్రవారం స్వాతికి పెళ్లి జరగాల్సి ఉంది. ఆర్థిక స్తోమత లేకపోవడంతో వాట్సాప్ గ్రూప్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుమ్మరి రాజు, ఊదరి సత్యనారాయణ, డాక్టర్ సుధాకర్, యల్లం రాజు శ్రీనివాసరావు, రమణ ఉన్నారు.

చెత్త సేకరించే వారి సమస్యలు పరిష్కరించాలి

రామంతాపూర్: అంతర్జాతీయ చెత్త సేకరణ కార్మికుల దినోత్సవం సందర్భంగా గురువారం రామంతాపూర్ మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్‌లో హైదరాబాద్ గార్బేజ్ లిఫ్టర్ సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ తరపున ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛ ఆటోలతో చెత్త సేకరించే కార్మికుల కుటుంబాలు దుర్భర పరిస్థితుల్లో బతుకుతున్నారన్నారు. అనేక వ్యాధులకు గురవుతున్నారని, వారికి వచ్చే ఆదాయంలో ఎక్కవ శాతం వైద్యానికే ఖర్చు పెడుతున్నారన్నారు. చెత్త సేకరించే వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. హైదరాబాద్ గార్బేజ్ లిఫ్టర్ సంఘం ప్రతినిధులు వివేక్ జోసఫ్, ఇందిరమ్మ, మంజుల, మాధవి, బాలరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

